# కమనీయం.. శివపార్వతుల కల్యాణం

జూలూరుపాడు/ కొత్తగూడెం టౌన్/ అశ్వారావుపేట టౌన్/ పాల్వంచ, మార్చి 9 : మహాశివరాత్రి సందర్భంగా కొత్తగూడెం, జూలూరుపాడు, అశ్వారావుపేట, పాల్వంచల్లోని ప్రముఖ ఆలయల్లో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. అంగరంగ వైభవంగా జరిగిన ఈ ఆదిదంపతుల కల్యాణ ఘట్టాన్ని భక్తులందరూ తిలకించి తరించారు. జూలూరుపాడు మండలం పాపకొల్లు, బేతాళపాడు గ్రామాల్లో కాకతీయుల కాలంనాటి అతిపురాతన శ్రీ ఉమాసోమలింగేశ్వరస్వామి దేవాలయం, సోమన్నలొద్దిలో ఉన్న దేవాలయంలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణాల్లో జరిగిన శివపార్వతుల కల్యాణ క్రతువుని శుక్రవారం అర్ధరాత్రి వరకూ కొనసాగింది. విద్యుత్ దీపాల కాంతుల్లో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన ఆలయ మంటపంలో శివపార్వతుల కల్యాణ ఘట్టం జరిగింది. హాజరైన వందలాది మంది భక్తులకు నేత్రపర్వంగా నిలిచింది. భజనలు, కోలాటాలు, పాటలు ఆకట్టుకున్నాయి. కొత్తగూడెంలోని విజయవిఘ్నేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోనూ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవాలయంలో పార్వతీ పరమేశ్వరుల దివ్య కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. పెండ్లి కుమారుడిగా దుర్గామల్లేశ్వర స్వామి, పెండ్లి కుమార్తెలుగా పార్వతిదేవి, గంగాదేవిలు పెండ్లిపీటలపై కూర్చోగా వేద పండితులు స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. ఆలయ ఈవో సులోచన దంపతులు ఈ కల్యాణ ఘట్టాన్ని జరిపించారు. పాల్వంచ శైవాలయాల్లో ఆయా ఆలయ కమిటీల బాధ్యులు అన్నదానం నిర్వహించారు. చింతలచెరువు కట్ట వద్ద ఉన్న శ్రీ ఆత్మలింగేశ్వర స్వామి దేవాలయంలో, శ్రీనివాసకాలనీ వద్ద ఉన్న శ్రీ సోమలింగేశ్వర స్వామి దేవాలయంలో, బొల్లోరుగూడెంలోని శ్రీ లలిత కామేశ్వరి దేవాలయంలో, గట్టాయిగూడెంలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

కొత్తగూడెంలో కల్యాణ క్రతువును జరిపిస్తున్న అర్చకులు

### అన్నపురెడ్డిపల్లిలో..

అన్నపురెడ్డిపల్లి, మార్చి 9 : మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీస్వామి వారి కల్యాణ మహోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. శనివారం ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పురోహితుడు ప్రసాదాచార్యులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు.

### 'వైభవంగా త్రిశూల స్నానం'

అన్నపురెడ్డిపల్లి, మార్చి 9 : మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ సమేత శ్రీమల్లిఖార్జున స్వామి దేవాలయంలో త్రిశూల స్నానం వైభవంగా నిర్వహించారు. శనివారం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హోమాలు, పూర్ణాహుతి, ఆలయ బలిహరణ, ధ్వజ అవరోహణము, త్రిశూల స్నానం, రథోత్సవములు, పర్యంకోత్సవం నిర్వహించారు.

### టేకులపల్లిలో...

టేకులపల్లి, మార్చి 9 : కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో జరిగిన శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య లక్ష్మీ దంపతులు పాల్గొన్నారు. పలు ఆలయాల్లో జరిగిన కల్యాణాల్లో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అశ్వారావుపేటలో శివకల్యాణం జరిపిస్తున్న పండితులు

పాల్వంచ : ఆత్మలింగేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

లక్ష్మీదేవిపల్లి : రాజ్యసభ సభ్యుడు వద్దిరాజును సన్మానిస్తున్న బీఆర్ఎస్ నేతలు

## బీఆర్ఎస్ గెలుపు కోసం శ్రమిస్తాం

### ఎంపీలు నామా, వద్దిరాజుతో బీఆర్ఎస్ నాయకులు

లక్ష్మీదేవిపల్లి/ కొత్తగూడెం అర్బన్, మార్చి 9: గడిచిన మూడు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని కొత్తగూడెం నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు అన్నారు. దీంతో ప్రజలంతా మరోసారి కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని అన్నారు. ఇందుకోసం తాము కూడా శ్రమించి ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తామని అన్నారు. రాజ్యసభ సభ్యుడిగా వద్దిరాజు మరోసారి ఎన్నిక కావడం, ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా నామా నాగేశ్వరరావు మరోసారి ఖరారు కావడంతో బీఆర్ఎస్ కొత్తగూడెం నియోజకవర్గ నాయకులు పలువురు శనివారం ఖమ్మం ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్రలను వారి వారి నివాసాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీలను కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు కొట్టి వెంకటేశ్వరరావు,కొల్లు పద్మ, కనుకుంట్ల శ్రీనివాస్, పోస్టాఫీస్ వాసు, తలుగు అశోక్, శ్రీకాంత్, మునర్న, ఈశ్వర్, బుడ్డీ, బండి నరసింహారావు, మహ్మద్ యూసుఫ్ ఉన్నారు.

కొత్తగూడెం అర్బన్ : రవిచంద్రను కలిసిన నాయకులు

## రూ.3.11కోట్లతో సీసీ రోడ్ల పనులు ప్రారంభం

### శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

టేకులపల్లి, మార్చి 9 : మండలంలోని పలు గ్రామాలలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కోరం కనకయ్య శనివారం శంకుస్థాపన చేశారు. డీఎంఎఫ్‌టీ నుంచి రూ.40లక్షలతో సీసీ రోడ్లు, ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.2.71కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు, అంగన్‌వాడీ కేంద్రాల ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లెలు పట్టణాలకు ధీటుగా అభివృద్ధి జరిగేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్, ఎంపీటీసీలు బానోత్ పూర్ణ, సరోజిని, శాంతకుమారి, కోరం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న కోరం కనకయ్య

## మండలంలో ఎమ్మెల్యే జారే విస్తృత పర్యటన

అశ్వారావుపేట టౌన్, మార్చి 9 : హలో శుభోదయం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని అశ్వారావుపేట, గుర్రాల చెరువు, పేరాయగూడెం, నారంవారిగూడెం, భీముని గూడెం పంచాయతీలలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను ఇంటింటికీ వెళ్లి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. పేట మాలపల్లి దళిత కాలనీలోని రైతులు 911 సర్వే నెంబర్‌లో ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని ఇప్పటికీ పట్టాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కృష్ణ ప్రసాద్‌కు సమస్యను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జూపల్లి రమేశ్, మొగళ్ల చెన్నకేశవరావు, తుమ్మ రాంబాబు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జారే

## రికార్డులను తిరగరాస్తున్న ఇల్లెందు ఏరియా

### ఏరియా జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు రూరల్, మార్చి 9 : ఇల్లెందు ఏరియా బొగ్గు ఉత్పత్తి లక్ష్యంలో రికార్డులను తిరగరాస్తున్నదని ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. శనివారం జీఎం కార్యాలయంలో ఆయన బొగ్గు ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఇల్లెందు ఏరియాకు కేటాయించిన 40 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని 23 రోజుల ముందే లక్ష్యాన్ని అధిగమించడం జరిగిందన్నారు. లక్ష్యాన్ని పూర్తి చేయడంలో ఏరియా ఉద్యోగులు అంకిత భావంతో పని చేసి బొగ్గుట్టను ప్రథమస్థానంలో నిలపడంతో చూపిన కృషిని కొనియాడారు.

## సీఎం ప్రజాదీవెన సభను విజయవంతం చేయండి

### ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్, మార్చి 9 : ఈ నెల 11న మణుగూరులో నిర్వహించే ప్రజాదీవెన సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. శనివారం స్థానిక హనుమాన్ గార్డెన్స్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోమవారం భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆరు గ్యారంటీలలో ఒకటైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తారన్నారు. అనంతరం మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో నిర్వహించనన్న ప్రజాదీవెన సభలో పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఆయా సమావేశాల్లో మాజీ ఎమ్మెల్యేపొదెం వీరయ్య, ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, నాయకులు చందా సంతోశ్, కాటిబోయిన నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, వైస్ఎంపీపీ కేవీరావు, పట్టణ అధ్యక్షులు శివ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్యాచారి, సీపీఐ మండల నాయకులు పాల్గొన్నారు. కళాశాలలోని హెలీప్యాడ్, ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సభా ప్రాంగణాన్ని, పార్కింగ్ స్థలాలను డీఎస్పీ రవీందర్‌రెడ్డితో కలిసి ఎస్పీ రోహిత్‌రాజ్ పరిశీలించారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు నిర్వహించాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

## త్రివేణి విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ర్యాంకులు

భద్రాచలం, మార్చి 9: రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ పోటీల్లో త్రివేణి పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారని ప్రిన్సిపల్ మంజుల తెలిపారు. 8వ తరగతి చదువుతున్న పీ పూజా స్రవంతి, వీ నిహారికకు ద్వితీయ బహుమతి, 9వ తరగతి చదువుతున్న శ్రీసాయి వేద వైష్ణవి, బీ తపస్వినీలకు తృతీయ బహుమతులు సాధించారని పేర్కొన్నారు. వీరిని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు తన క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో ఏవో బాబురావు, వైస్ ప్రిన్సిపాల్ విమలాదేవి, అకడమిక్ ఇన్‌చార్జి నరేశ్, క్యాంపస్ ఇన్‌చార్జి సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నిరంగాల్లో మహిళ లదే పైచేయి

### మహిళా దినోత్సవ వేడుకల్లో వక్తలు

ఇల్లెందు రూరల్, మార్చి 9 : అన్నిరంగాల్లో మహిళలు పురుషులకు సమానంగా పోటీపడుతున్నారని ఏపీయం దుర్గారావు అన్నారు. శనివారం సెర్ఫ్ ఆధ్వర్యంలో 21ఫిట్ ఏరియాలోని కమ్యూనిటీ హాల్ గ్రౌండ్‌లో నారీ శక్తి ఫిట్‌నెస్ ర్యాలీని ఎంపీటీసీలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉమెన్ ఫిట్ - ఇండియా హిట్ అనే స్ఫూర్తితో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. 500 మీటర్ల రన్నింగ్‌ను మహిళలకు నిర్వహించామన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపీటీసీలు పూనెం సురేందర్, పాయం కృష్ణ, మాజీ సర్పంచ్ ధనసరి స్రవంతి, కమ్యూనిటీ కోఆర్డినేటర్ మంచాల స్వర్ణలత, ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, కార్యదర్శి సౌజన్య, కోశాధికారి సద్గుణ, గ్రామ సంఘ సహాయకులు నవ్య, ప్రమీల, సుల్తానా, బేబి, రాణి, ఝాన్సీ పాల్గొన్నారు.

భద్రాచలం: నారీశక్తి రన్‌లో పాల్గొన్న విద్యార్థినులు

### అశ్వారావుపేటలో...

అశ్వారావుపేట, మార్చి 9 : కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా శనివారం నారీ శక్తి ఫిట్‌నెస్ రోజుగా ప్రకటించంతో మండల కేంద్రంలో సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు పరుగు పందెం నిర్వహించారు. ఈ పోటీలను సెర్ప్ ఏపీఎం వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించారు. సీసీలు, మండల సమాఖ్య పాలక సభ్యులు పాల్గొన్నారు.

### పినపాకలో..

పినపాక, మార్చి 9 : మండల సమాఖ్య ఏపీఎం జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన నారీ శక్తి రన్ కార్యక్రమాన్ని శనివారం ఎంపీవో వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు నెహ్రూ యువకేంద్రం ఖమ్మం వారిచే టీషర్టులు, మగ్గులు టోపీలు పంపిణీ చేశారని జ్యోతి తెలిపారు. సమాజంలో మహిళల పాత్ర, మహిళలను గౌరవించాలనే అంశాలపై కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ఆమె తెలిపారు.

### నారీ శక్తి రన్..

భద్రాచలం/ దుమ్ముగూడెం, మార్చి 9: నెహ్రూ యువ శక్తి ఖమ్మం, డీఆర్‌డీఏ భద్రాద్రి జిల్లా ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులు నారీ శక్తి రన్ నిర్వహించారు. ఇందిరా క్రాంతి పథం ఏపీవో జే జగదీశ్, పీఈటీ, ఐకేపీ సీసీలు రాంబాబు, సీతారామ్, వీవోఏలు, విద్యార్థినులు పాల్గొన్నారు. దుమ్ముగూడెం మండలంలోని బీ కొత్తగూడెంలో విజేతలకు బహుమతులు అందజేశారు. మాజీ సర్పంచ్ కటిబోయిన వెంకటేశ్వర్లు, ఎపికర్ సంస్థ బాధ్యులు ధర్మరాజు, మల్లయ్య, కాళేశ్వరరావు, సావిత్రి, కిరణ్‌బాబు, జాన్‌బాబు, వెంకటేశ్, జీ సావిత్రి పాల్గొన్నారు.

### రిటైర్డ్ ఉద్యోగినులకు సన్మానం

చుంచుపల్లి, మార్చి 9: మండలంలోని విద్యానగర్ కాలనీలో ఉన్న తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేసన్ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగినులైన పరుచూరి ఝాన్సీలక్ష్మి, సామినేని కుసుమాంబ, విజయలక్ష్మి, పోల్కంపల్లి శకుంతల అనే సీనియర్ సిటిజన్ మహిళలను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

## రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాలుగోసారి 'కోటేశ్వరరావు'

### ప్రైవేట్ జూనియర్ కాలేజీల సంఘానికి ఉమ్మడి జిల్లా నుంచి మరో ఇద్దరు

మాచవరపు కోటేశ్వరరావు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, మార్చి 9: తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కాలేజీల సంఘం రాష్ట్ర కమిటీలో ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురికి చోటు లభించింది. కొత్తగూడెం కృష్ణవేణి - త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ మాచవరపు కోటేశ్వరరావు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాలుగోసారి నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కోటేశ్వరరావుతోతపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వీరారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రవీణ్‌రెడ్డి ఎన్నికయ్యారు.

## 50 కిలోల గంజాయి పట్టివేత

జూలూరుపాడు, మార్చి 9: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట చేపట్టిన వాహన తనిఖీల్లో కారులో తరలిస్తున్న సుమారు 50 కేజీల ఎండు గంజాయి శనివారం పట్టుబడింది. జూలురుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి ఆదేశాల మేరకు జూలూరుపాడు పోలీసులు తమ పోలీస్ స్టేషన్ ఎదుట శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేశారు. అందులో సుమారు 50 కేజీల ఎండు గంజాయి లభించింది. దీంతో కారు డ్రైవర్‌తో పాటు కారులో ఉన్న మరో వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 'నేటి నుంచి ఉపాధిహామీ సామాజిక తనిఖీలు'

పాల్వంచ రూరల్, మార్చి 9: ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీల్లో భాగంగా మండలంలోని అన్ని పంచాయితీల్లోనూ ఈ నెల 10 నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 సంవత్సరాల్లో జరిగిన పనులకు సంబంధించిన వివరాలను పరిశీలించనున్నట్లు చెప్పారు.

## రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

భద్రాచలం, మార్చి 9: పట్టణంలోని పాత ఎల్ఐసీ కార్యాలయం రోడ్డులోని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వరంగల్‌కు చెందిన శరత్ మాక్సి విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు బంధు వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనానికి రూ.50 లక్షలు మంజూరు

### తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ మరో రూ. 50లక్షలు

భద్రాచలం, మార్చి 9: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు రూ. 50లక్షల నిధులు మంజూరు చేయించారు. అదేవిధంగా ఈ కళాశాల పూర్వ విద్యార్థి, తానా మాజీ అధ్యక్షుడు, తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ తాళ్లూరి జయశేఖర్ మరో రూ. 50లక్షలు అందజేస్తానని హామీ ఇచ్చారు. శనివారం తాళ్లూరి జయశేఖర్, కళాశాల అభివృద్ధి మాజీ చైర్మన్ అడుసుమిల్లి జగదీశ్, కమిటీ సభ్యులు చావా లక్ష్మీనారాయణ, భద్రాద్రి కళాభారతి వ్యవస్థాపకుడు అల్లం నాగేశ్వరరావు, తాళ్లూరి ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీ కళాశాలను సందర్శించి రూ. 50లక్షలు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా జయశేఖర్‌కు ఎమ్మెల్యే వెంకట్రావుకు కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ కృష్ణవేణి సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోడి పందేల స్థావరాలపై పోలీసుల దాడి

దమ్మపేట, మార్చి 9 : వేర్వేరు కోడి పందేల స్థావరాలపై ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి శనివారం దాడి చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రాచూరుపల్లి శివారులో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారయినట్లు ఎస్ఐ తెలిపారు. వీరి వద్ద నుంచి నాలుగు మోటార్ సైకిళ్లు, ఒక పందెం కోడి పుంజు, రూ.8,500/- నగదు స్వాధీనం చేసుకోగా లింగాలపల్లి శివారులో ఐదుగురు వ్యక్తులు, నాలుగు మోటార్ సైకిళ్లు, రెండు పందెం కోడి పుంజులు, రూ.12 వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## సంక్షిప్తం..

### కల్తీ మందుతో ఎండిన పంట

చండ్రుగొండ, మార్చి 9 : కల్తీ మందుతో పంట ఎండిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. రైతు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని తిప్పనపల్లి గ్రామానికి చెందిన రామిశెట్టి రామారావు వరిపొలంలో ఓ కంపెనీ ప్రతినిధులతో కలిసి వ్యాపారి వారం రోజుల క్రితం డెమో(నమూనా) పేరుతో వరిపైరుపై కలుపుమందు పిచికారీ చేశారు. రెండురోజుల అనంతరం వరి క్రమంగా ఎండిపోవడం, దుబ్బులు కుళ్లిపోతున్నాయి. ఈ విషయాన్ని డీలర్ తెలియజేయగా తనకు ఆ కంపెనీ మందుకీ ఎటువంటి సంబంధం లేదని మాటమార్చాడు. దీంతో చేసేదేమి లేక రైతు మండల వ్యవసాయశాఖ అధికారులకు, పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 7న ఫిర్యాదు చేశాడు. ఏవో వినయ్‌ను వివరణ కోరగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### మిర్చి కొనుగోళ్లలో దళారుల మోసం

అశ్వారావుపేట, మార్చి 9 : మిర్చి కొనుగోళ్లలో దళారులు మోసాలకు పాల్పడుతుండడంతో పసిగట్టిన రైతులు దళారులను నిలదీశారు. సమాచారం అందుకున్న పోలీసులు రెండు వ్యాన్లను అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గుమ్మడవల్లిలో తాలు మిర్చి కొనుగోలుకు ఖమ్మం జిల్లా తల్లాడ మండలానికి చెందిన ఏడుగురు వ్యాపారులు వచ్చారు. మార్కెట్‌లో తాలు మిర్చి క్వింటా రూ.7 వేలు ఉండగా తాము మాత్రం రూ.9 వేలకు కొనుగోలు చేస్తామని రైతులకు ఆశ చూపారు. దీంతో రైతులు తాలు మిర్చిని దళారులకు విక్రయించారు. తూకం వేస్తుండగా అనుమానం వచ్చి ఎలక్ట్రికల్ కాంటాతో పరీక్షించారు. ఏకంగా 50కేజీల బస్తాకు 15కేజీల వరకు తేడా వచ్చింది. దళారుల మోసాన్ని గ్రహించిన రైతులు నిలదీశారు. దళారుల్లో ఒక వ్యక్తి తన సెల్‌ఫోన్లో ప్రత్యేక యాప్‌లో ముందుగానే తుకాన్ని నమోదు చేయడం ద్వారా మోసానికి పాల్పడినట్లు రైతులు గుర్తించారు.

### గుప్తనిధుల కోసం తవ్వకాలు..?

అశ్వారావుపేట, మార్చి 9 : మండలంలోని ఏజన్సీ ప్రాంతంలో ఓ రైతు వ్యవసాయ భూమిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు చేపట్టారు. గుప్తనిధుల కోసమే అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నందిపాడు వెళ్లే రహదారిలో గాడ్రాల అడ్డరోడ్డు వద్ద అతి పురాతన ఆలయం ఉంది. ఆలయానికి సమీపంలో గిరిజనుడి పోడు భూమిలో నాలుగు రోజులుగా అర్ధరాత్రి సమయంలో పూజలు చేసి జేసీబీతో భారీ తవ్వకాలు చేపట్టారు. విషయం బయటకు పొక్కడంతో శుక్రవారం గోతిని పూడ్చివేశారు. పొలం యజమానిని అడుగగా తనకు తెలియదని సమాధానం ఇచ్చారు.

### ఆరుబయట చెత్తవేస్తే జరిమానా

అశ్వారావుపేట టౌన్, మార్చి 9 : ఆరుబయట చెత్తచెదారం వేస్తే జరిమానా విధించాలని డీఎల్‌పీవో రాజీవ్‌కుమార్ అధికారులకు సూచించారు. శనివారం స్థానిక మేజర్‌పంచాయతీ కార్యాలయంలో పేరాయగూడెం, మేజర్‌పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వ్యాపారులు, గృహాల్లోని చెత్తను రోడ్లపై వేయవద్దని చెప్పారు. అంతర్గత రహదారులలో ముళ్లపొదలతో పాటు రోడ్డుపై మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. సమావేశంలో మేజర్‌పంచాయతీ ఈవో గజవెల్లి హరికృష్ణ, కార్యదర్శి శ్రీరామ్మూర్తి, సిబ్బంది ఉన్నారు.

### సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

కొత్తగూడెం అర్బన్, మార్చి 9: మున్సిపాలిటీ పరిధిలోని 35వ వార్డు అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కౌన్సిలర్ రుక్మాంగదర్ బండారి శనివారం భూమిపూజ చేశారు. రజనీకాంత్ బండారి, కాలిపటాన్, సయ్యద్ జానీ, బాలకృష్ణ, రమణ, వేణు, కొండా పాల్గొన్నారు.

### లారీ ఓనర్లను ఆదుకోవాలి

టేకులపల్లి, మార్చి 9 : కేవోసీ ప్రభావిత ప్రాంత లారీ ఓనర్లను ఆదుకోవాలని అసోసియేషన్ అధ్యక్షుడు నేలవెల్లి నరసింహారావు కోరారు. శనివారం మండలం కేంద్రంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బడా కాంట్రాక్టర్లు వారి స్వలాభం కోసం 142 రూపాయలకే టెండర్ వేశారని, దీని వలన స్థానిక లారీ ఓనర్లకు భారీ నష్టం వస్తుందన్నారు. బోడ మంగీలాల్, అరవ వెంకటేశ్, గోపి, బానోత్ రవి, గుర్రం రామారావు, బానోత్ మోహన్, మాజీ అధ్యక్షుడు బానోత్ రామా నాయక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### 'అర్హులకు ఉచిత కరెంట్ ఇవ్వాలి'

కొత్తగూడెం అర్బన్, మార్చి 9: అర్హులైన ప్రతి ఒక్కరికీ 200 యూనిట్ల ఉచిత కరెంట్‌తోపాటు రూ.500కే గ్యాస్ అందించాలని 23వ వార్డు కౌన్సిలర్ వై.శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఆయా సమస్యలపై మున్సిపల్ కార్యాలయంలో శనివారం దరఖాస్తులు చేసుకుంటున్న లబ్ధిదారులతో కలిసి కమిషనర్ శేషాంజన్ స్వామికి అందించారు.

### సీసీడ్రైన్ నిర్మాణ పనుల పరిశీలన

బూర్గంపహాడ్, మార్చి 9 : జిల్లాలోని బూర్గంపహాడ్ మండలం లక్ష్మీపురంలో ఎంపీ లాడ్ నిధుల నుంచి రూ.45 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రైన్స్ నిర్మాణ పనులను జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత శనివారం పర్యవేక్షించారు. రహదారికి ఇరువైపులా ఉన్న చెత్త, పిచ్చిమొక్కలను డోజర్ సాయంతో తొలగించారు. పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, మాజీవార్డు సభ్యులు పాలం దివాకర్‌రెడ్డి, బొల్లా దుర్గయ్య, ఏసుబ్, ఉపేందర్ పాల్గొన్